క్లుప్తంగా

లీకవుతున్న రైవాడ కల్వర్టు



కల్వర్టు నుంచి లీకవుతున్న రైవాడ కాలువ నీరు

వేపాడ: వేపాడ – ఆనందపురం రహదారిలో నీలకంఠరాజపురం వద్దనున్న రైవాడ కల్వర్టు లీకవడంతో సాగునీరు వృథాగా పోతోంది. కల్వర్టు నుంచి నీరు ఆనందపురం వెళ్లే ప్రధాన రహదారి మీదకు రావడంతో వాహన చోదకులు, బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి లీకులను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని రైవాడ కాలువ పర్యవేక్షకుడు పోలినాయుడు వద్ద ప్రస్తావించగా.. కల్వర్టు లీకును గుర్తించి అరికడతామని చెప్పారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



గొట్లాంలో చెత్త సంపద కేంద్రంను పరిశీలిస్తున్న డీపీఓ మల్లికార్జునరావు

బొండపల్లి: మండలంలోని గొట్లాంలో గల చెత్త సంపద కేంద్రంతో పాటు, రక్షిత మంచి నీటి పథకాలను జిల్లా పంచాయతీ అధికారి డోల మల్లికార్జునరావు శుక్రవారం పరిశీలించారు. కేంద్రాలను వాడుకలోకి తీసుకువచ్చి చెత్తను తరలించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే మంచినీటి పథకాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచేడలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎ.రఘుపతిరావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, కోరాడ కృష్ణ, తదితరులున్నారు.

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

మెరకముడిదాం: మండలంలో మద్యం ఏరులై పారుతుందనడానికి మండలంలో ఉన్న బెల్ట్ షాపులే ఉదాహరణ. ఎందుకంటే మండలంలో సుమారు 60 నుంచి 70 వరకు బెల్ట్‌షాపులున్నాయి. ఈ బెల్ట్ షాపులలో మద్యం బాటిల్‌పై ఉన్న ధర కంటే అదనంగా పది నుంచి 20 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. లైసెన్స్ షాపుల పరిధిలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

వసతిగృహం సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ

చీపురుపల్లి: పట్టణంలోని సమీకృత బాలుర వసతిగృహంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర కళాశాలల వసతిగృహాన్ని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ పరిశీలించారు. గురువారం రాత్రి చీపురుపల్లి వచ్చిన ఆమె వసతిగృహాన్ని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించి, భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వసతిగృహానికి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి మంగళగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిరసన తెలియజేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

చీపురుపల్లి: ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను తప్పుబడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఎంఈఓ -1 పోస్టును జిల్లా పరిషత్ పంచాయతీరాజ్ యాజమాన్యం నుంచి తప్పించి ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు కట్టబెట్టడం సరికాదని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, రామాంజనేయకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కర్లాం ప్రాథమిక పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు మెండి జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం..

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి
- అమలు కాని సూపర్‌సిక్స్ హామీలు



రామలింగాపురం గ్రామంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, తదితరులు

కొత్తవలస: చంద్రబాబునాయుడు అంటే గుర్తుకొచ్చేది మోసం.. దగా.. వీటితోనే ఆనాడు సొంత మామనే మోసం చేసి తెలుగుదేశం పార్టీని లాక్కున్నారని, నేడు మళ్లీ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామలింగాపురం, చీడివలస గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. నమ్ముకున్న నాయకులు, ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబునాయుడు సిద్ధహస్తుడని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలిచ్చి, నేడు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని అనడానికి కూటమి నాయకులకు సిగ్గులేదా అని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలతో పాటు మరిన్ని పథకాలు ఇస్తామని చెప్పి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అభివృద్ధి జాడే లేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలన రెండో ఏడాదిలోకి వచ్చినా ఒక్క భవనం కూడా కట్టలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. అక్రమ కేసులు, అరెస్టులతో పైశాచిక ఆనందం పొందుతున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాను అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలిత ముండదన్నారు. ఇదిలా ఉంటే కూటమి నాయకులకు ఓట్లేసి ఘోరంగా మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కూటమి నాయకులకు బుద్ధి చెబుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు నీలంశెట్టి గోపెమ్మ, నెక్కల శ్రీదేవి, సర్పంచ్ నెక్కల గౌరినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు లెంక వరహాలు, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు మచ్చ ఎర్రయ్యరామస్వామి, విరోతి కొండలరావు, పార్టీ నాయకులు పల్లా భీష్మ, మాధవరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి మోసాలు..



జామిలో బాబుమోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జామి: మండల కేంద్రమైన జామిలో వైఎస్సార్‌సీపీ నేతలు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ఎన్నికల హామీలు అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు వంటి పథకాల జాడే లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, ఎంపీపీ సబ్బవరపు అరుణ, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సూరిదేముడు, నేతలు అప్పాన సుబ్రహ్మణ్యం, పిన్నింటి రవికుమార్, కిలారి సూర్యారావు, జన్నేల సూరిదేముడు, వాసు, ఎస్.అప్పలరాజు, అమ్మన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలను మోసం చేశారు...



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పొట్నూరు సన్యాసినాయుడు , తదితరులు

గుర్ల: కూటమి నాయకులు పేద ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు ఆరోపించారు. మండలంలోని పెనుబర్తిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వచ్చాయని.. నేడు కూటమి హయాంలో ప్రజలు నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోళ్ల సుబ్రహ్మణ్యం, తుమ్మగంటి పరమేష్, అంబల్ల చిన్నారావు, రెడ్డి అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

● కూటమి నేతలను నిలదీయండి

బొండపల్లి: మండలంలోని జె.గుమడం, కొవ్వాడపేట గ్రామాలలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుల చేసిన మోసాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి నాయకులు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. ఇదిలా ఉంటే నాయకుల చేతిలో ఘోరంగా మోసపోయామని ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి రమణ, సాలపు పెంటంనాయుడు, మంత్రి గోవింద, పల్లి రఘు, మంత్రి చిన్నమ్మలు, ఎం. కిశోర్, ఎం.రామ్మూర్తి, ఎం .వెంకీరాజు, తదితరులు పాల్గొన్నారు.



జె.గుమడం గ్రామంలో మహిళలకు బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

● ప్రజలను వంచించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు..



మధుపాడలో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, తదితరులు

గంట్యాడ: ప్రజలను వంచించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని మధుపాడ, తాటిపూడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ.. కూటమి నాయకులు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగారపు అప్పారావు, మండల ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగారపు సత్యారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కె.విజయ్, ఉపాధ్యక్షులు పాటు పురెడ్డి వెంకటరావు, పార్టీ నాయకులు, కిలపర్తి శ్రీరామ్మూర్తి, తదతరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయొద్దు



జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయవద్దని, అటువంటి విధానాలను విడనాడాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జరుగుతున్న తొమ్మిదో జాతీయ మహాసభల సందర్భంగా స్థానిక జిల్లా కమిటీ కార్యాలయంలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ శుక్రవారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ విద్యను కుదించే ప్రయత్నం జరుగుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందివ్వకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు డి.రాము, తిరుపతినాయుడు, సత్యనారాయణ, గంగాధరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

బొండపల్లి: మండలంలోని గెద్దపేట గ్రామ సమీపంలోని చెరువు గట్టుపై జూదం ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూదరుల నుంచి 20,240 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

శ్రావణ సందడి..



చీపురుపల్లి: కనక మహాలక్ష్మి దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలయాల్లో శ్రావణ సందడి నెలకొంది. శ్రావణమాస రెండో శుక్రవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. వివిధ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: కాత్యాయినిదేవిగా గాజుల అలంకరణలో ఎస్.కోటలో దుర్గమ్మ



చీపురుపల్లి: మానసాదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్త జన సందోహం



చీపురుపల్లి: పూజలందుకుంటున్న మానసాదేవి నాగశక్తి అమ్మవారు



వేపాడ: వేంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: గడసాంలో పూజలు అందుకుంటున్న దుర్గాదేవి

తల్లిపాలు అమృతం..



గుర్ల: భూపాలపల్లిలో తల్లిపాల ప్రయోజనాలను వివరిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



మెరకముడిదాం: భైరిపురంలో తల్లిపాలు వలన కలిగే లాభాలను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి



గంట్యాడ: ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ, తదితరులు



శృంగవరపుకోట: తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అచ్యుత



వేపాడ: కృష్ణారాయుడుపేటలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ అశ్విని, కార్యకర్తలు

బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని వక్తలు అభిప్రాయపడ్డారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వాడవాడలా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను ఐసీడీఎస్, వైద్యాధికారులు వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని సూచించారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని.. ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా బిడ్డకు తల్లిపాలు పట్టాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

అప్పారావుకు బొత్స పరామర్శ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పతివాడ అప్పారావును మాజీ మంత్రి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన అప్పారావు..విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, అక్కడే తన కుమారుడి ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బొత్స సత్యనారాయణ..ఆయన వద్దకు వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

'పోలీస్ వెల్ఫేర్ డే'

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్.. పోలీస్ సిబ్బంది నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పోలీసుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.